# జీవిత [వి] చిత్రం

వి. వి. బి. రామారావు

"జీవితం విచిత్ర సంఘటనల వింత గొలుసు. నథింగ్ ఈజ్ ఇంపాసిబుల్. కాని కొన్ని సంఘటనలు మాత్రం కేవలం విబ్సర్డ్."

టీ కప్పు చేత్తో పట్టుకొస్తున్న నన్ను చూసి లెక్చరు ప్రారంభించారు శ్రీవారు. ఆయన కళ్లల్లోకే చూస్తూ టీ కప్పు టేబిల్ మీద పెట్టాను.

ఆయన కుర్చీలోంచి లేచి కిటికీవద్దకు వెళ్లి, తల వేడెక్కిపోయిందేమో, చల్లటి కిటికీ ఊచలమీద నుదురు ఆనించి వర్షం వేపే చూస్తున్నారు.

ఖాళీ అయిన వెచ్చటి కుర్చీలో కూచున్నాను. కిటికీవైపు నుండి టేబిల్ మీదకు దృష్టి మళ్లించాక ఆయన రాయడం పూర్తిచేసి జెమ్‌క్లిప్ పెట్టిన కాగితాల బొత్తి కంటపడింది.

తీసి చదవడం ప్రారంభించాను.

*　　*　　*

వెంకట్రామయ్యగారు బోల్డు సంబరపడిపోయి, బజారుకు బయలుదేరినాయన హటాహుటి ఇంటి కొచ్చేశారు "ఓయ్" అంటూ లోపలకి కేకేస్తూ.

"ఏం నాన్నా!"

స్వయంకృషితో బ్రతుకు పూలబాట చేసుకుందామనే తపన, స్వయం ప్రతిభతో కత్తిరిద్దామనుకుంటున్న లేటెస్ట్ ఫేషన్ బ్లవుజూ అలమారాలో పడేసి సావిట్లోకి వచ్చింది, అభ్యుదయ భావాలున్న పెళ్లీడు పిల్ల ఉషారాణి.

"అమ్మను పిలువ్!"

గోడనున్న పంచాంగం కేలెండరు తీసి కుర్చీలో చేరగిలబడ్డారు వెంకట్రామయ్యగారు.

"ఏమిటండీ హడావుడి? బజారు కెళ్లలా?" పైటచెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది కామాక్షమ్మగారు.

"అమ్మాయ్, కాస్త నిమ్మకాయ రసం కలిపిపట్టుకురా!"

ఉషారాణి సొంతం లోపల కెళ్లిందనుకున్నాక అసలు విషయం ప్రస్తావించారు.

"మీ అన్నయ్య దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. ఇదిగోచూడు."

"ఉత్తరం నాకెందుకండీ, అంతా కులాసాయేనా? ఏమిటి విశేషాలు?"

"వెర్రిమొద్దా.ఉషకి మంచిసంబంధంవట. కాకినాడే; కాస్త పొలము, ఓ డాబా ఉన్నవాళ్లేనట. యమ్. కామ్ ప్యాసయ్యాడట. నాలుగూ మాటాడుకోవచ్చు, పిల్లాణ్ని చూశాక. ఓవారం రోజులపాటు తీరిక చూసుకుని రమ్మన్నాడు. రేపు పంచమి భేషుగ్గా ఉంది. నువ్వూ వస్తావా?"

"నే నెందుకండీ, మీరు వెళ్లిరారాదూ?"

"శకున పక్షీ నువ్వెప్పుడూ ఇంతే. మీ అన్నయ్యకు మన స్థితిగతులు తెలియవా ఏం? కావడానికి వీలులేని సంబంధం మన కెందుకు చెబుతాడూ?"

"ఏమో తెద్దురూ, ముందు మీరే వెళ్ళి రండి."

కామాక్షమ్మ మనసులో ఉద్దేశం వెంకట్రామయ్యకు తెలియనిదికాదు. ఆడవాళ్ల వెడితే కట్నకానుకలూ, తర్జన భర్జనలూ పెళ్లికొడుకు అర్హతలనుబట్టి కనీసం పదివేలైనా అడిగేటట్టుంది. ఇంతకీ కుర్రాడి ఉద్యోగం ఏమిటో... సరియైన ఉద్యోగం అయితే ఉన్నకొంప కాస్తా కరిగించైనా ... పెళ్లికి డబ్బు ఎలా ఏర్పాటు చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాడు వెంకట్రామయ్య.

పంచమి నాటికి చేరాడు కాకినాడ.

బావమరిది ప్రయివేట్ ప్రాక్టీస్‌లో చాలా బిజీగా ఉన్నాడు. వీధిగదినిండా విద్యార్థులు— అతను మాటాడుతున్నది తెలుగైనా వెంకట్రామయ్యకేం తెలిసి చావడంలేదు. తనూ చదివాడు ఆర్థిక శాస్త్రం, ఏం లాభం?

సుందర్రావు ఆర్థికశాస్త్ర విభాగంలో ఉపన్యాసకుడు. మంచిఫైలూ, పలుకుబడీ ఉన్నవాడు. ప్రయివేట్ ప్రాక్టీస్ ప్రతిఫలంగా ఓ యాభైవేల నగదూ, ఓమేడా, సంపాయించాడు.

రాత్రి ఎనిమిదయింతర్వాత పూర్తయ్యింది హోమ్ వర్క్ సుందర్రావుకి. భోజనాల గదిలో పెళ్లి విషయం ప్రారంభించాడు.

"మీ అన్నయ్యేం చేస్తున్నాడోయ్?" అని అడిగాడు, ఆ వేణు మాధవరావుగారి అబ్బాయిని."

ఏ విషయాన్నైనా పూసగుచ్చినట్టు వివరంగా చెప్పడం సుందర్రావు స్ట్రాంగ్ పాయింట్. కుర్రాళ్లు కాలేజీలో క్లాసులకి రాకపోయినా, ఇంటిదగ్గరకొచ్చి దొంతులిచ్చి నేర్చుకుపోతుంటారు ఆర్థిక శాస్త్రమంతా ముక్తసరిగా ముప్పై టాపిక్స్‌లో.

వెంకట్రామయ్య చేతిలోనిముద్ద చేతిలోనే ఉంది. కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు.

"మొన్ననే ఎమ్.కామ్. ప్యాసయ్యాడు సార్. ఇంకా ఉద్యోగమేమీ దొరకలేదు" అన్నాడు చిరంజీవి."

"నీకంటె ఎంత పెద్దంటావ్?" మెల్లగా కూపీ తీశాను.

సుమారు ఇరవైనాలుగేళ్ల వాడు. నాకు వాళ్ల నాన్నగారిని బాగాతెలుసు. ఆ కుర్రాడు అరవై తొమ్మిది, డెబ్బైలో బి. కాం చదవడం నాకు తెలుసు. అరవై ఎనిమిది ఇంటర్ కాలేజియేట్ డిబేట్స్‌లో..."

సుందర్రావు జ్ఞాపకాలు ఇంకా లోతుకు పోకుండానే తరువాత ప్రశ్న వేశారు వెంకట్రామయ్యగారు, తన నలభై సంవత్సరాల మేష్టరీలో ఆర్జించుకున్న ఆక్యుపేషనల్ డిసీజ్— విసుగు—ను అతికష్టంతో కప్పిపుచ్చుతూ.

"అయితే సుందర్రావ్, నువ్వన్న వేణుమాధవరావుగారు ఏం చేస్తుంటారు?"

"స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తుండేవారు. ఈ మధ్య రిటైరై ఈ ఊళ్లోనే స్థిరపడిపోయారు. చాలా పెద్ద ఆఫీసర్. ఒకసారి హైదరాబాదులో కనపడి..."

"కుర్రాడు ఏం చేస్తున్నాడన్నావ్?" ఆతృతతోఉన్న పెళ్లికూతురు తండ్రి మళ్లీ ఆపవలసి వచ్చింది.

"ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాడు. యం.కామ్ పాసయ్యాడని వ్రాశానుగా. ఇక్కడ కాలేజీలో చదువుకుంటున్నప్పటినుంచీ చురుకుగా డిబేట్స్‌లోనూ, ఎలక్యూషన్స్‌లోనూ, పాల్గొంటూ ఉండేవాడు. మంచి ప్రొగెసివ్ వ్యూస్ ఉన్నవాడు."

"కుర్రవాడెలా ఉంటాడు?"

"సన్నగా, పొడుగ్గా, చామన చాయగా— హిప్పీజుట్టు, బెల్ బాటమ్స్, అన్నీ ఆధునిక యువకుల లక్షణాలే."

— ఇదొక్కటే నచ్చినట్టు లేదు హైస్కూలు మాష్టరుగారిగా రిటైరైన పాతకాలం వెంకట్రామయ్యగారికి.

"నువ్వు ఈ సంబంధం గురించి వేణు మాధవరావుగారితో చెప్పావా ?"

"అబ్బే, ఇంకా లేదు. చెబుతున్నాగా, నువ్వు సొంతం చెప్పనిస్తేనా!" పెళ్లికొడుకు తమ్ముడుద్వారా విషయాలన్నీ తెలుసుకున్నాను. మనం వాళ్లఇంటికి వెళ్లి నాలుగూ మాటాడుకుని వద్దాం."

వెంకట్రామయ్యగారి ముఖ్య సందేహం నివృత్తి కాలేదు. మర్నాడు పొద్దున్నే బావా మరుదులిద్దరూ వేణుమాధవరావుగారి ఇంటికి వెళ్లారు.

ఇల్లు చూడగానే వెంకట్రామయ్యగారికి సంబంధం నచ్చినట్టే అనిపించింది. హాల్లో పెద్ద వెంకటరమణమూర్తి పటం. పెళ్లికొడుకు చురుకుగా ఉన్నాడు. కుర్చీలో కూచున్న కుర్రాడు వచ్చే పెద్ద మనుషులను ఆహ్వానించాడు లోపలికి.

"మాష్టారూ, నమస్కారం, రండిసార్ రండి. నాన్నగారు లోపల పూజ చేసుకుంటున్నారు. వచ్చేస్తారు."

"మీ తమ్ముడేం చేస్తున్నాడోయ్ ?" కలుపుగోలు ప్రశ్న వేశారు మాష్టారు.

"పొద్దున్నే ట్యూషన్‌కు వెళ్లాడు సార్!"

కొద్దిసేపట్లో వేణు మాధవరావుగారు ఇవతలకి వచ్చారు.

సుందర్రావు ప్రారంభించాడు తన క్లాస్ రూమ్ ఫారమ్‌లో.

"వీరు మా బావగారు, వెంకట్రామయ్యగారు. విజయవాడలో ఉంటున్నారు. నలభై ఏళ్ల హైస్కూల్లో పనిచేసి రిటైరయ్యారు. మద్రాసులో పచ్చయప్ప కాలేజీలో బి. యే. పాసయి, యల్. టి. చదివారు. ఆ రోజుల్లో ఇంగ్లీషు బి. య్యే. పది హేనేళ్లు హెడ్ మాస్టర్ పనిచేశారు. ఆ రోజుల్లో..."

వెంకట్రామయ్యగారు కుర్చీలోంచి ముందుకు వంగేసుకుని మళ్లీ చేరబడిపోయారు.

పెంచను పుచ్చుకున్న స్టేట్‌బ్యాంక్ ఏజంటుగారు ఓపికగా వింటున్నారు. ట్రేతో కాఫీ కప్పులు పట్టుకొచ్చాడు పెళ్లికొడుకు.


"అయ్యా. మా బావగారి కడసారపు కూతురు, యంగెస్ట్ డాటర్, పెళ్లికి ఉంది. మీ అబ్బాయికి ఇవ్వాలని మా సంకల్పం. మనకూ మనకూ చాలా రోజులుగా పరిచయం ఉంది. ఉభయుల సాంప్రదాయాలూ కలుస్తాయి. మీరు అవునంటే అమ్మాయిని తెచ్చి ఈ ఊళ్లోనే చూపించాలనుకుంటున్నాము."

సుందర్రావు ఆశ్చర్యకరంగా ప్రస్తుతంలోకి డ్రైవ్‌చేసి, ఆట్టే పూసలు గుచ్చకుండా వచ్చినపనిని వివరించాడు.

"చూడండి మాష్టారూ, ఈ కాలం కుర్రాళ్ళకు మనం చెప్పవలసిందేమీ లేదు. మా వాడికి ఈ వయసులో పెళ్లి చేయాలనే మా కోరిక. అబ్బాయి ఇక్కడే ఉన్నాడు కదా! మీరే అడగండి. ఏంవోయ్, మాష్టారు చెప్పిన మాటలు విన్నావుకదా, ఏమంటావ్ ?"

"మాష్టారూ మొన్న దీపావళికి మీఇంటికి వచ్చిన అమ్మాయేనా, పెళ్లికూతురు ?"

—వెంకట్రామయ్యగారు ఆశ్చర్యపోయారు.



ఉషారాణి దీపావళికి మామయ్యగారింటిదగ్గరే ఉంది. అయినా ఈ కుర్రవాడికెలా తెలుసు— ‘ఈ కాలం పిల్లలు’అని సరిపుచ్చుకున్నాడు.

పెద్ద మాష్టారి ఆలోచనలు తెలుసుకున్నట్టు అన్నాడు పెళ్ళికొడుకు ‘‘మాష్టారూ, మీతో ఫ్రాంక్‌గా మాటాడుతున్నాను. మరోలా అనుకోకండి. చిరంజీవి కోసం ఓ రోజు మీ ఇంటికి రావలసివచ్చింది... నేను వచ్చేసరికి ట్యూషన్ అయిపోయింది. బెల్ కొట్టగానే ఓ అమ్మాయి వచ్చి తలుపు తీసింది. మీకు ఆడ పిల్లలు లేరని నాకు తెలుసు వెనక్కు తిరిగి వచ్చినతరువాత చిరంజీవి వల్ల తెలుసుకున్నాను వివరాలన్నీ...’’

కొత్తకాలం నవల చదువుతున్నట్లనిపించింది పెద్ద మాష్టారికి మరి ఈ సంబంధం గురించి సుందరావు ప్రస్తావించినప్పుడు చిరంజీవి చనువుగా, ఇందుయిరెక్టుగా, తన అన్నయ్య ఈ సంబంధం ఇష్టపడినట్టు చెప్పాడా ?

అవకాశాన్ని గమనించిన సుందర్రావు వెంటనే అందుకున్నాడు: ‘మీరు చూస్తామంటే అమ్మాయిని తెప్పిస్తాం.’’

‘‘మేం చూసేదేముంది పిల్లవాడికి ఇష్టమయిన తరువాత? ఇంతకీ మాకు కావలసింది సంపదాయం. ల్లా బుద్ధిమంతురాలై అణకువగా ఉండడం.’’

‘‘...అమ్మ చూసానంటోంది’’

వెంకటామయ్య సుందర్రావూ, ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

‘‘అది సరే, మరి ముహూర్తం...’’అర్ధోక్తిలో వదిలేశారు పెద్ద మాష్టారు అసలు విషయాన్ని ఎలిసిట్ చేయడానికి వేయబోయే

# జీవిత [వి] చిత్రం

ప్రశ్న.

‘‘అది మీ ఇష్టం సార్. నా మనసులో మాట చెబుతున్నాను. కట్నాల విషయంలో మా ఇంట్లో అందరికీ నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయ్. మేం కట్నాలు ఇచ్చే అవసరం లేదు, నాకు సిస్టర్స్ లేరు కాబట్టి. ఇకనేం పుచ్చుకోవడమా, దేవుడి దయవల్ల మాకు సరిపోయేటంత మా దగ్గర ఉంది. కట్నాలు పుచ్చుకోవడం సాంఘికంగా మనమంతా కలిసి నిర్మూలించవలసిన దురాచారం!’’

డిబేట్ ధోరణిలో వెళుతున్న కుర్రాడిని అలా చూస్తున్నాడు సుందర్రావు అబ్బాయి మీద అప్పుడే విపరీతమైన అభిమానం పుట్టుకొచ్చింది పెద్ద మాష్టారికి.

‘‘ముహూర్తం విషయం, నాకు ఉద్యోగం అయిన తరువాత ఎప్పుడు పెట్టినా నాకు అభ్యంతరం లేదు.’’

‘‘అదేమిట్రా అలా అంటావ్. మీ అమ్మ చెప్పినట్టు ఇష్టమైన అమ్మాయి దొరికినప్పుడు పెళ్ళిచేసుకో, దొరికినప్పుడే చేద్దువు కాని ఉద్యోగం !’’

‘‘కాదు నాన్నగారూ, ఉద్యోగం అయితే కాని చేసుకో కూడదనుకున్నాను. అది నా నిర్ణయం.’’

—వెంకట్రామయ్యగారు దీర్ఘాలోచనలో పడ్డారు.

‘‘సరే శెలవ్, అమ్మాయిని వచ్చేవారంలో తెప్పిస్తాను మీ దర్శనం మళ్ళీ చేస్తా’’ అంటూ శెలవు తీసుకున్నాడు సుందర్రావు.

ఇద్దరూ ఇవతలకొచ్చారు.

‘‘ఫస్ట్‌క్లాసయిన సంబంధం దొరికిందోయ్, అమ్మాయికి’’ సుందరావు భలే హుషారుగా అన్నాడు. తల వంచుకుని నడుస్తున్న వెంకటామయ్యగారు మనసులోని ఆలోచనలను పైకి తేల్చారు.

‘‘ఓ విషయం ఆలోచించావా, అబ్బాయికి ఉద్యోగం అయేవరకు చేసుకోనన్నాడు. మరి ఉద్యోగం సంగతి ఎవరు చెప్పగలరు ? మనమేం చెయ్యగలం ? ఈ అబ్బాయి కోసం అమ్మాయిని అలానే ఉంచుతామా, మరో సంబంధం చూస్తామా ?’’

‘‘ఇంతకీ అమ్మాయికి అబ్బాయి నచ్చాలిగా, నువ్వెళ్ళి ఓసారి తీసుకురా’’

‘‘తీసుకొస్తా సరే, మరి ఉద్యోగం?’’

‘‘అంతా యోగం బావా. అన్నీ అవే కలిసివస్తాయ్, యోగం బాగుంటే ...’’

ఆలోచనతో సతమతమౌతూ సాయంకాలం ఆఖరి బస్సులో తిరుగు ప్రయాణం కట్టారు మాష్టారు.

రైళ్ళ స్టాయికు మెల్లగా ఓ టిక్కెట్టు దొరికింది. బస్సులో కూచున్నారు మాష్టారు. కాసేపు అయాక తన పక్కనే ఓ బట్టతలాయన కూర్చున్నాడు — కూచుంటూనే ‘‘నమస్కారం’’ అన్నాడు.

బస్సు బయలుదేరింది. బాగా చీకటి పడింది.

‘‘జ్ఞాపకం ఉన్నానా మాష్టారూ ?’’

‘‘లేదుబాబూ, మరేమీ అనుకోకండి, పెద్దవాడినయ్యానుకదా !’’

‘‘ఎంతమాట మాష్టారూ, నాలాంటి వాళ్ళు మీ దగ్గర ఎంతమంది చదువుకున్నారో


ఆల్బో-సాంగ్

అన్ని వయసుల
వారికి ఆదర్శక బలవర్థకం

వారు అన్నివిధాల ఆరోగ్యంగా వుండాలంటే మీకు ఆల్బో-
సాంగ్ అవసరం. వృద్ధులకు, యువకులకు కూడా పటిష్టమైన
శరీరాన్ని ఆరోగ్యాన్ని సంపాదించుటకు ప్రత్యేకమైన పదార్థా
లు ఆల్బో-సాంగ్‌లో చేర్చబడ్డాయి. ఈ రోజు ప్రతి రోజూకూడా
ఆల్బో-సాంగ్ తీసుకోండి. సర్వదా మీరు ఆరోగ్యంగా వుంటారు






జె. అండ్ జె. డీషేన్
హైదరాబాదు (దక్కన్).

అజీర్ణం వల్ల మీరు భయపడుతున్నారా?

హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకొని - తిరిగి తినడం ప్రారంభించండి




సి. జె. హ్యూలెట్ & సన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 600 002,
కలకత్తా 700 001

SAA/CJH/1191

WHEN NATURE FAILS

H New Super Height మరింతఎత్తు,పొడుగు కాగలరు (2నుండి 8అం. వరకు పూచీ)

For Super Heightness

మీరు పొడుగు పెరగ దలచుకుంటే ప్రపంచప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great **name and meant for popular people.** వెల : బుడ్డి 1 కి (20 Tabs) Rs. 3-75. పోస్టేజి అదనం. 3 Phails (60 Tabs) Rs. 11-25. Postage free.

**SCIENCE HAS SOLVED THE PROBLEMS**

STOP GREY HAIR పిన్నవారుగా అగుపించండి. మీరు పిన్నవారైనట్లేమీకుఅనిపిస్తుంది. (Feel) Unobtainable anywhere else in the world. సంవత్సరాలుగా జరిపిన పరిశోధన ఫలితమైన బాల్ కాలా తేల్ BAL KALA TEL Brilliantine Hair Colour అద్భుతముగ తెల్లజుట్టును శాశ్వతంగా వేళ్ల నుంచి నల్లబడేట్లు చేస్తుంది. వెల: బుడ్డి 1కి Rs. 3 only. పోస్టేజి అదనం. 3బుడ్లు Rs. 7-50 పోస్టేజి ఉచితం. తల తెల్లగాగాని, రంగువేసినట్లుగాని అగుపించదు. షరా: ఉత్తరాలుఇంగ్లీషులో వ్రాయండి.

**M/S. VICTORIA COMMERCIAL COY, A.M.W. (3/75) Flat Door No. 3883X, Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)**

# జీవిత [వి] చిత్రం

నేనుమాత్రం మిమ్మల్ని ఎప్పుడూ మరచి పోలేను.''

బట్టతలాయన మనసు గతంలోకి పోయింది.

వెంకట్రామయ్యగారంటే స్కూల్లో పిల్లలందరికీ భయమే. ఎంత బాగా పాఠం చెప్పేవారో అంత స్ట్రిక్ట్‌గా ఉండి పిల్లలందరినీ డిసిప్లిన్‌డ్‌గా ఉంచేవారు. తను ఆ ఇంటా, ఈ ఇంటా తినీ చదువు సాగించాడు. అతి చిన్నవయసులోనే తల్లినీ దండ్రినీ గోల్పోయిన మందభాగ్యుడు. తనకు ఓ వారం ఇవ్వడమేకాక, బడి జీతానికి డబ్బులు చాలకపోతే పోనీలేరా గోపాలం, కష్టపడి చదువుతున్నావ్, ఈనెల జీతం నే కట్టేస్తాలే, నీ దగ్గరున్న డబ్బు వచ్చేనెలకు దాచుకో'' అనేసేవారు.

మాష్టార్ని చూసి ఎన్నాళ్లయిందో! తనెవరో చెప్పకుండా ఎలా ?

''మాష్టారూ !''

అప్పుడే కునుకు పడుతున్న వెంకట్రామయ్యగారు మెల్లగా కళ్లు విప్పారు. ఆవులింతతోపాటు వళ్లు విరుచుకుంటూ చేతులు పైకెత్తారు.

మీద నుండి ఓ సూట్‌కేస్ మీదపడింది. అదే క్షణంలో బస్సు రోడ్డు దిగి ఓ పెద్ద చెట్టుని ఢీకొని ఆగిపోయింది. తను చేతులెత్తకపోతే బట్టతలాయనకు తల పగలవలసిందే. యాక్సిడెంటయినా అదృష్టవశాత్తూ పెద్ద దెబ్బలేవరికీ తగలలేదు. బస్సు మాత్రం మళ్లీ కదిలేటట్టు లేదు.

ప్రయాణీకులంతా బస్సు దిగి తమ తమ అదృష్టాలను అభినందించుకుంటున్నారు. చావవలసింది, బ్రతికున్నామే అని. కొందరు డ్రైవరు ప్రతిభను మెచ్చుకుంటున్నారు.

''స్టీరింగ్ ఫెయిలయ్యిందట—ఇంకానయం చెట్టు మనల్ని రక్షించింది'' అన్నాడు కాస్త డ్రయివింగ్ విషయం తెలిసినవాడు. మరో బస్సుకోసం కబురు పంపడం జరిగింది.

''మాష్టారూ, అలా వెళ్లి ఆ సిమ్మెంటు దిమ్మ మీద కూచుందాం రండి'' బట్టతల తడుముకుంటూ అన్నాడు గోపాలం.

''సరే పదండి.''

రోడ్డుమీద నుండి మెల్లగా నడుస్తున్నారిద్దరూ.

''నేను గోపాలాన్ని మాష్టారూ!''

''ఆఁ గోపాలమా, మా స్కూల్లో చదివావ్ కదోయ్. ఎంతవాడివయ్యావ్, నువ్వు జ్ఞాపకంలేక పోవడమేం, నేను నిన్ను గుర్తుపట్టలేక పోయాను కాని. నేనూ కామాక్షీ నిన్ను తలుచుకొంటూనే ఉంటాం. బాగా మారిపోయావ్ సుమా !''

''నన్నోమనిషిని చేశారు మాష్టారూ ! మీ మేలు మరచి పోలేను—ఈరోజు మీరు చేతులెత్తకపోయి ఉంటే ఆ పెట్టె నా నెత్తిన పడేది.''

''బాబూ, అంతాయోగం, అంతా దైవేచ్ఛ, మనమేంచేసే వాళ్ళం కాదు.'' పాత రోజుల గురించి కబుర్లు ప్రవాహంలాసాగిపోతున్నాయ్. గోపాలం తక్కున ప్రస్తుతంలోకి వచ్చాడు.

''మాష్టారూ, పిల్లలంతా కులాసా?''

''కులాసాయే నాయనా, పెద్ద పిల్లలిద్దరూ కాపురాలు చేసుకుంటున్నారు. చిన్నది పెళ్లికుంది. దాని సంబంధం విషయమై కాకినాడ వచ్చాను. సంబంధం నాకు నచ్చింది. వేణు మాధవరావు గారని, వారబ్బాయి. యం. కామ్ పాసయ్యాడు కుర్రాడు. యోగ్యుడు. అయితేనేం, ఉద్యోగం అయితే కాని చేసుకోనంటున్నాడు.''

''వేణుమాధవరావు గారంటే రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ ఏజంటేనాండి ?''

''ఆఁ ఆయన నీకు తెలుసా ?''

''అయ్యో వారిని తెలియక పోవడమేం ? రామారావ్‌పేటలో ఉంటున్నారు. ఆయన దగ్గర నేను కొద్ది నెలలు ప్రొబేషనర్‌గా పని చేశాను—అప్పట్టి మరిచిపోయాను, ఈ మధ్య వారబ్బాయి ఉద్యోగానికి పంపిన దరఖాస్తు నా దగ్గరే ఉంది. నేను పెర్సనల్ ఆఫీసర్‌గా ఉంటున్నాను. చాలా తొందరలో ఆయనకు ఉద్యోగం వచ్చేస్తుంది మాష్టారూ, మంచి మార్కులొచ్చాయి. పెళ్లికి తప్పకుండా వస్తా మాష్టారూ నేను ఇప్పుడు హైదరాబాదులోనే ఉంటున్నా. నా పేరు రాసి స్టేట్ బాంక్ అంటే వచ్చేస్తుంది ఉత్తరం.''

మాష్టారు చాలా సంతోషించారు. హడావిడిగా ఇంటికి చేరారు.

రిక్షా వీధి మలుపు తిరుగుతుంటే ఎడమవైపు ఇంటిలోంచి కుడివైపు ఇంటిలోకి ఆదరా బాదరా పరిగెత్తింది ఓ నల్లపిల్లి.

శకునంతో ఏం సంబంధం, వెళ్లినపని సొంతం పండేకదా అని తృప్తిగా ఊపిరిపీల్చు

కున్నారు మాష్టారు. కాని తలుపు తీయడానికి వచ్చిన కామాక్షమ్మ భర్తనుచూసి బావురు మందిఆమె తెల్లారిలేచి చూసేసరికి అమ్మాయి మంచం ఖాళీ.

కన్నీటిబొట్లతో తడిసిన ఉత్తరం ఆమె దగ్గర పుచ్చుకుని కుర్చీలో కూలబడ్డారు మాష్టారు.

"అమ్మా,

నీ మనసు, నాన్నగారి మనసు కష్టపెట్టడం నా ఉద్దేశం కాదు. నాన్నగారూ, నువ్వూ నన్నెంత ప్రేమగా పెంచారో నాకు తెలుసు. నాన్నగారి స్థితిగతులు నాకు తెలియనివి కావు. ఇంత చదువూ చదివి, ఇంతదానినై, నీ గుండెలమీద కుంపటినై, నాన్నగారికి గుదిబండనై ఇక్కడ బ్రతకలేను— నా పెళ్ళికి కట్నం ఎక్కడనుండి తెస్తారు, అలాగని తల పెట్టడమూ మానరు. ఇల్లు అమ్మేసి ఎక్కడుంటారమ్మా! — ఆడపిల్లనైనా, మొగపిల్లాడిలా ఆదుకుంటా మిమ్మల్ని

నా స్నేహితురాలు సునంద లేదూ, నీకు జ్ఞాపకం లేదేమో, యస్సెల్సీ వరకూ చదువుకున్నాం ఇద్దరమూ, వాళ్ళాయన నాకు ఉద్యోగం వేయిస్తావన్నారట. మద్రాసు వెళుతున్నాను. నాకోసం మీరేమీ బెంగ పెట్టుకోవద్దు. ఏ అఘాయిత్యానికీ ఒడి కట్టుకోనని, అమ్మవి, నీకు తెలీదూ!

నాన్నగారికి నా నమస్కారాలని చెప్పు.

ఉషారాణి.

పెద్ద మాష్టారు వెంకట్రామయ్యగారు కుర్చీలోంచి లేవనూ లేదు, ఆయన నోటివెంట మాట రానూ లేదు.

* * *

"యూ, యూ, యూ ఆర్ క్రూయల్."

గట్టిగా అరిచేసాను. నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు శ్రీవారు.

టేబిల్ మీద నిండుగాఉన్న టీ కప్పు కనపడింది. టీ అయిస్‌లా అయిపోయి ఉండాలి. నా ఏకాగ్రత భంగం చెయ్యకూడదన్నట్టు ఇంతసేపూ కిటికీదగ్గరే నిలబడి ఉన్నారు ఆయన.

ఇట్ ఈజ్ ఫన్నీ, నో ఇట్ ఈజ్ ఎబ్సర్డ్.

